కడుపు నిండేలా.. భక్తి

జైజై.. గణేశా... అంటూ నగరంలో భక్త జనం జై కొడుతోంది.. చాలా చోట్ల గణనాథుని భక్తులకు నిర్వాహకులు అన్న సంతర్పణాలు నిర్వహిస్తున్నారు. ఇలాంటి భక్తి పారవశ్య కార్యక్రమాలు నగరంలో ఎంతో మంది కడుపు నింపుతూ చేయూత ఇస్తున్నాయి. చిన్నవాళ్లు, పెద్దవాళ్లు అంతా అన్నం పరబ్రహ్మ స్వరూపంగా భుజిస్తుండగా, మరి కొందరు నిల్వ చేసుకునే ప్రయత్నంలో ఉన్నట్టు తోస్తుంది.. ఈ చిత్రం.

మల్టీ లెవల్ పార్కింగ్@కేబీఆర్ పార్కు

- రూ.2.98 కోట్లతో 15,500 కొత్త ఎల్ఈడీ స్ట్రీట్ లైట్లు
- సీఎస్ఆర్ కింద పలు అభివృద్ధి పనులకు పచ్చజెండా
- జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో 14 అంశాలకు ఆమోదం

సమావేశంలో మాట్లాడుతున్న మేయర్, చిత్రంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

సిటీబ్యూరో, సెప్టెంబరు 12(నమస్తే తెలంగాణ): కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు గాను పార్కు ఎంట్రీ గేట్ వన్ వద్ద మల్టీ లెవల్ స్మార్ట్ కార్ అండ్ మోటార్ సైకిల్ పార్కింగ్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఈ మేరకు మల్టీ లెవల్ కారు పార్కింగ్ కేంద్ర నిర్మాణం, 10 ఏండ్ల ఎక్కువకు బిడ్డర్ అయిన నవ నిర్మాణ్ అసోసియేషన్ సంస్థకు లెటర్ ఆఫ్ అవార్డు ఇచ్చేందుకు గాను రాటిఫికేషన్‌కు జీహెచ్ఎంసీ కమిషనర్‌కు రికమండ్ చేస్తూ స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. వీటితో పాటు వివిధ వాట్స్‌లలో 15,500 కొత్త ఎల్ఈడీ స్ట్రీట్ లైట్లు కొనుగోలు చేసేందుకు రూ.2.98 కోట్లకు పరిపాలన అనుమతితో షార్ట్ టెండర్ పిలిచేందుకు కమిటీ ఆమోదించింది. సీఎస్ఆర్ పద్ధతిలో చెరువుల అభివృద్ధికి, చెరువులలో దోమల నివారణకు డ్రోన్ల ద్వారా స్ప్రే చేసేందుకు ముందుకు వచ్చే వారిని గుర్తించాలని మేయర్ అధికారులకు సూచించారు. గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన 5వ స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. కమిటీ సమావేశంలో 14 అంశాలకు సభ్యులు ఆమోదించినట్లు ఆమె తెలిపారు.

ఎస్సీలో ఆమోదించిన అంశాలు

జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న 90 మంది కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు/ కమ్యూనిటీ ఆర్గనైజర్ల పే స్కేల్‌ను ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం, జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ పెంపు ప్రతిపాదనలను కమిటీ ఆమోదించింది. బండ్లగూడ జంక్షన్ నుంచి ఎర్రకుంట జంక్షన్ వరకు 100 అడుగుల రహదారి విస్తరణ అభివృద్ధికి ఎస్ఆర్‌డీపీ కింద రూ.20 కోట్ల వ్యయంతో చేపట్టే రోడ్డుకి 44 ఆస్తుల సేకరణ, షేక్‌పేట మండల పరిధిలోని బంజారాహిల్స్ రోడ్ నం.14లో యాక్సెస్ రోడ్డు కేటాయింపునకు హైకోర్టు ఆదేశాల మేరకు డాక్టర్ టి.సురేఖ, ఏ.విజయలక్ష్మిలకు చెందిన ప్లాట్లకు 70.04 చదరపు గజాల స్థలానికి మార్కెట్ విలువ చదరపు గజానికి ఒక లక్ష రూపాయల చొప్పున చెల్లింపుపై ఎన్వోసీ జారీ చేసేందుకు కమిటీ ఆమోదం తెలిపింది. హఫీజ్‌పేటలోని కైదమ్మ కుంటను సీఎస్ఆర్ కింద పునరుద్ధరించుటకు మల్లిగావద్ ఫౌండేషన్ వారితో ఆరు నెలల కాలానికి ఎంఓయూ, సికింద్రాబాద్ – సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్ల మధ్య బాక్స్ పుషింగ్ పద్ధతిలో కొత్త వంతెన నిర్మాణానికి రూ.19.74 కోట్లకు పరిపాలన అనుమతులు, లోతు కుంట రైల్వే బ్రిడ్జి నుంచి అల్వాల్ ఆర్వోబీ తెలుగు తల్లి విగ్రహం వద్ద జీహెచ్ఎంసీ పరిధి వరకు 60 మీటర్ల ప్రతిపాదిత రోడ్డు వెడల్పునకు ప్రభావితమయ్యే 107 ఆస్తుల సేకరణకు కమిటీ ఆమోదించింది. మజీద్ బండ కుడి కుంట నాలాకు రూ.3.96 కోట్ల అంచనా వ్యయంతో వరద నీటి కాలు పనులకు షార్ట్ టెండర్, చందానగర్ సర్కిల్‌లో కేఎస్సార్ లే అవుట్ వద్ద సీఎస్ఆర్ కింద 43,600 చదరపు అడుగులలో అర్బన్ ఫారెస్ట్ అభివృద్ధికి మేసర్స్ తువక్కం వెల్ఫేర్ అసోసియేషన్‌తో మూడేండ్ల కాలానికి జోనల్ కమిషనర్ ఎంఓయూ, శేరిలింగంపల్లి జోన్‌లో సీఎస్ఆర్ కింద ఐదు చోట్ల ఇంజక్షన్ బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాలు, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణానికి గాను మేసర్స్ వాటర్ ఎయిడ్ ఆర్గనైజేషన్‌తో జోనల్ కమిషనర్ ఎంఓయూ కుదుర్చుకునేందుకు అనుమతి ఇచ్చింది. గోపన్‌పల్లిలో 500 గజాల స్థలంలో పెంపుడు జంతువుల స్మశాన వాటిక నిర్మాణం, మూడేండ్ల పాటు నిర్వహణను తమ సొంత నిధులతో మేసర్స్ రాగ ఫౌండేషన్ వారితో జోనల్ కమిషనర్‌తో ఒప్పందం కుదుర్చుకునేందుకు అనుమతి ఇస్తూ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో కమిషనర్ ఆమ్రపాలి, స్టాండింగ్ కమిటీ సభ్యులు, అదనపు కమిషనర్లు నళిని పద్మావతి, చంద్రకాంత్ రెడ్డి, యాదగిరి రావు, పంకజ, మంగతాయారు, సీసీపీ శ్రీనివాస్, చీఫ్ ఎంటమాలజీ డాక్టర్ రాంబాబు, చీఫ్ వెటర్నరీ డాక్టర్ అబ్దుల్ వకీల్, జోనల్ కమిషనర్లు అపూర్వ్ చౌహాన్, హేమంత్ కేశవ్ పాటిల్, ఉపేందర్ రెడ్డి, వెంకన్న, రవికిరణ్, ప్రాజెక్టు సీఈ దేవానంద్, హౌసింగ్ సీఈ అనిల్ రాజ్ పాల్గొన్నారు.

'అవాయిడ్ ఆల్కహాల్.. ఎంజాయ్ ఫెస్టివల్'

సిటీబ్యూరో, సెప్టెంబర్ 12(నమస్తే తెలంగాణ): వినాయక నిమజ్జనంలో కొంతమంది మద్యం తాగి భక్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని దావత్ వితౌట్ దారు సంస్థ వ్యవస్థాపకుడు చేగొండి చంద్రశేఖర్ అన్నారు. 'అవాయిడ్ ఆల్కహాల్.. ఎంజాయ్ ఫెస్టివల్' థీమ్‌తో అవగాహన కల్పిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఇటీవల నిమజ్జనోత్సవంలో కొందరు మద్యం సేవించి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్టు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. ఈ క్రమంలో మద్యం తాగి ఆధ్యాత్మిక వాతావరణానికి ఇబ్బంది కలిగించొద్దంటూ సోషల్ మీడియా వేదికగా 'దావత్ వితౌట్ దారు' టీం పిలుపునిచ్చింది.

నేటి నుంచి ఇంటర్నేషనల్ ఆర్ట్ షో

సిటీబ్యూరో, సెప్టెంబర్ 12(నమస్తే తెలంగాణ): మాదాపూర్, కావూరి హిల్స్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శుక్రవారం నుంచి ఈ నెల 17వ తేదీ వరకు ఇంటర్నేషనల్ ఆర్ట్ షో జరగనుందని నిర్వాహకులు గురువారం పేర్కొన్నారు. 200 మంది ఆర్టిస్టులు ఈ షోలో పాల్గొంటున్నారు. 400 పైగా పెయింటింగ్స్ ప్రదర్శనకు ఉన్నాయి. ఆర్టిస్టులతో ముఖాముఖి, పెయింటింగ్స్‌పై అవగాహన కార్యక్రమాలు ఉండనున్నాయి. ప్రకృతి, ఆధ్యాత్మికం, గ్రామీణ, సిటీ కల్చర్ తదితర విభిన్న రకాల థీమ్స్‌పై పెయింటింగ్స్ ఆలోచన రేకెత్తించనున్నాయి. ఎంపిక చేసిన పలు పెయింటింగ్స్‌నే ఈ ప్రదర్శనలో ఉంచనున్నారు. పికాసో పెయింటింగ్స్ లైవ్‌లో ఉండనుందని నిర్వాహకులు వివరించారు.

పోస్టల్ కమిషన్ పెంచండి: ఆపరేటర్లు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 12(నమస్తే తెలంగాణ): ఫ్రాంఛైజీ పోస్ట్ ఆఫీస్ కమిషన్లను పెంచాలంటూ ఆపరేటర్లు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఫ్రాంఛైజీ పోస్ట్ ఆఫీసులతో ఆదాయం సమకూరడం లేదని, పోస్టల్ ఛార్జీలు తక్కువగా ఉన్నాయని, దీంతో నిర్వహణ సాధ్యం కావడం లేదని ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు స్పీడ్ పోస్ట్, రిజిస్టర్, స్టాంప్స్ ఛార్జీలను పెంచాలన్నారు. ఈ క్రమంలో ఛార్జీలు పెంచితే గానీ ఫ్రాంఛైజీ పోస్టాఫీసుల నిర్వహణ సాధ్యం కాదన్నారు.

నేడు ఇండ్ ఎక్స్‌పో ప్రారంభం

మాదాపూర్, సెప్టెంబర్ 12: పరిశ్రమల యంత్ర పరికరాలు, హ్యాండ్ టూల్స్, స్టీల్, పైప్, వాటర్ ట్రీట్‌మెంట్ సొల్యూషన్స్‌కు మాదాపూర్ హైటెక్ ఎగ్జిబిషన్ సెంటర్ శుక్రవారం వేదిక కానుంది. ఇండ్ ఎక్స్‌పో 2024 పేరుతో నేడు ప్రారంభం కానున్న కార్యక్రమానికి పలువురు పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు, వ్యాపారవేత్తలు హాజరుకానున్నారు. ఈ నెల 15 వరకు జరగనున్న ఈ ప్రదర్శనలో పరిశ్రమలకు చెందిన పలు యంత్ర పరికరాలు, ప్లాంట్స్, మెషినరీ, ఎక్విప్‌మెంట్స్, రూఫ్‌టాప్ సోలార్ ఎనర్జీ, లేజర్ కటింగ్ మెషీన్స్, హ్యాండ్ టూల్స్, మెషీన్ టూల్స్, ఈఆర్‌పీ సాఫ్ట్‌వేర్స్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్, స్టీల్, పైప్స్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్, సొల్యూషన్స్ వంటివి కొలువుదీరనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కబ్జా లెక్కలు తేలేలా.. నివేదికలు

- గూగుల్ ఎర్త్ ద్వారా కేఎంఎల్ మ్యాప్ నివేదికలకు 'రెవెన్యూ' సిద్ధం
- మేడ్చల్ జిల్లాలో తేలనున్న ప్రభుత్వ భూముల లెక్క



మేడ్చల్, సెప్టెంబర్ 12(నమస్తే తెలంగాణ): గూగుల్ ఎర్త్ ద్వారా కేఎంఎల్ మ్యాప్‌ల నివేదికలను సిద్ధం చేసే పనిలో రెవెన్యూ యంత్రాంగం నిమగ్నమైంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఉన్న ప్రభుత్వ భూములను గూగుల్ ఎర్త్ కేఎంఎల్ ద్వారా గుర్తించనున్నారు. ఈ కార్యక్రమం వేగవంతంగా పూర్తి చేసేలా జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాలు ఇచ్చారు. గూగుల్ మ్యాప్‌లను సిద్ధం చేసిన నివేదికలను ఆర్డీవోల ఆమోదంతో జిల్లా కలెక్టరేట్‌కు త్వరలోనే చేరనున్నాయి. గూగుల్ మ్యాప్ నివేదికలను తహశీల్దార్లు సర్వేయర్లతో కలిసి సిద్ధం చేయనున్నారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురైనట్లయితే క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించి గూగుల్ మ్యాప్‌లో పొందుపర్చనున్నారు. ఇప్పటికే ప్రభుత్వ భూములు కబ్జాలకు గురైనట్లు అనేక ఆరోపణలు ఉన్న విషయం తెలిసిందే.

కబ్జా చేసిన వారికి నోటీసులు...

గూగుల్ ఎర్త్ కేఎంఎల్ ద్వారా ప్రభుత్వ భూములను గుర్తిస్తున్న క్రమంలో కబ్జాకు గురైన భూముల వివరాలు తేలే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ భూములు కబ్జా చేసిన వారిని గుర్తించి వారికి నోటీసులిచ్చి క్రిమినల్ కేసులను నమోదు చేసే చర్యలు తీసుకోనున్నారు. ఇప్పటికే అనేక భూములు అన్యాక్రాంతమవుతున్న దృష్ట్యా గూగుల్ మ్యాప్‌లో ప్రభుత్వ భూములను చేర్చుతున్నారు. దీంతో ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

మేడ్చల్ జిల్లాలో తేలనున్న ప్రభుత్వ భూముల లెక్క..

గూగుల్ ఎర్త్ కేఎంఎల్ ద్వారా సిద్ధం చేయనున్న మ్యాపుల ద్వారా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఉన్న ప్రభుత్వ భూముల లెక్క తేలనుంది. జిల్లా వ్యాప్తంగా 5,195 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు గతంలో రెవెన్యూ అధికారులు గుర్తించారు. ప్రస్తుతం ఇందులో ఎన్ని ఎకరాలు కబ్జాకు గురైందన్న విషయం తెలిపోనుంది. బాలానగర్ మండలంలో 700 ఎకరాలు, శామీర్‌పేట్ మండలంలో 420, దుండిగల్ మండలంలో 425, మేడిపల్లి మండలంలో 900, ఘట్‌కేసర్ మండలంలో 500, కాప్రా మండలంలో 400, కీసర మండలంలో 417, కుత్బుల్లాపూర్ మండలంలో 600, బాచుపల్లి మండలంలో 360, ఉప్పల్ మండలంలో 333, మల్కాజిగిరి మండలంలో 113, మేడ్చల్ మండలంలో 37 ఎకరాలు ఉన్నట్లు రెవెన్యూ రికార్డులలో ఉంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో భూముల ధరలు విపరీతంగా పెరిగిన క్రమంలో ప్రభుత్వ భూములను కొందరు కబ్జాలు చేసుకున్నారు. దీంతో అసలు ప్రభుత్వ భూమి ఎంత అక్రమణలకు గురైందన్న విషయం గూగుల్ ఎర్త్ కేఎంఎల్ ద్వారా తెలిపోనుంది.

నిర్మాణ రంగ అనుమతుల జారీని వేగవంతం చేయండి

దరఖాస్తుల పరిష్కార ప్రగతిపై నివేదిక ఇవ్వండి
టౌన్ ప్లానింగ్ అధికారుల సమీక్షలో దాన కిశోర్ ఆదేశం

సిటీబ్యూరో, సెప్టెంబరు 12(నమస్తే తెలంగాణ): టీజీ బీ పాస్ (తెలంగాణ స్టేట్ బిల్డింగ్ పర్మిషన్ అప్రూవల్ అండ్ సెల్ఫ్ వెరిఫికేషన్ సిస్టం) దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దాన కిశోర్ టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. లే అవుట్, భవన నిర్మాణాలకు ఆన్‌లైన్ ద్వారా నిర్ణీత గడువులో అనుమతులు ఇచ్చే టీజీ టీ పాస్ దరఖాస్తుల పరిష్కార పురోగతిపై సచివాలయంలో గురువారం ప్లానింగ్ అధికారులతో ఆయన సమీక్షించారు. టీజీ బీ పాస్ దరఖాస్తుల డిస్పోజల్ వేగంగా చేపట్టాలని దాన కిశోర్ ఆదేశించారు. దరఖాస్తుతో జత చేయాల్సిన ఏవైనా డాక్యుమెంట్లు తక్కువగా ఉంటే ఆ విషయాన్ని దరఖాస్తుదారుడికి తెలియజేస్తూ తిరిగి అన్ని డాక్యుమెంట్లతో దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. ప్రస్తుత సంవత్సరం జనవరి నుంచి ఇప్పటి వరకు టీజీ బీ పాస్ కింద హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీలకు వచ్చిన దరఖాస్తులు వాటి పరిష్కార ప్రగతిపై తనకు నివేదికలు ఇవ్వాలన్నారు. ఇక నుంచి ప్రతి శనివారం టీజీ బీ పాస్ దరఖాస్తుల పరిష్కార ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో డీటీసీపీ డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, హెచ్ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్లు విద్యాధర్, రాజేంద్ర ప్రసాద్ నాయక్, జీహెచ్ఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, ప్లానింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్లానింగ్ అధికారులు, డిప్యూటీ సిటీ ప్లానర్లు పాల్గొన్నారు.

నత్తనడకన చర్లపల్లి పనులు

- పట్టించుకోని రైల్వే శాఖ
- రోడ్ల నిర్మాణాలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం: అధికారులు

హైదరాబాద్, సెప్టెంబర్ 12(నమస్తే తెలంగాణ): దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. వాస్తవానికి గత ఏడాది చివరి నాటికే పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాల్సిన ఉంది. కాని, ఈ చర్లపల్లి టెర్మినల్ అందుబాటులోకి రావడానికి గడువు ముగిసి తొమ్మిది నెలలైందన్నారు. రైళ్ల రాకపోకల వల్ల సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ వంటి రైల్వే స్టేషన్లపై పడే రైళ్లు, ప్రయాణికుల ఒత్తిడికి తగ్గించాల్సి ఉంది. అందులో భాగంగా దాదాపు రూ.430 కోట్లతో ఏర్పాటు చేస్తున్న టెర్మినల్ ఎప్పుడు ప్రయాణికులకు అందుబాటులోకి తెస్తారు అన్న అంశంపై రైల్వే అధికారులలో కూడా స్పష్టత లేనట్లు తెలుస్తుంది. ఈ విషయంలో కనీసం కేంద్ర ప్రభుత్వం గాని, రైల్వే బోర్డు గాని, సంబంధిత మంత్రి, అధికారులు ఎవరు కూడా సరైన సమాచారం ఇవ్వడం లేదని సర్వత్రా భావిస్తున్నారు. అయితే, టెర్మినల్ పనులు ఎంతవరకు వచ్చాయో తెలుసుకోవడానికి మాత్రం సంబంధిత మంత్రులు, అధికారులు, ఎంపీలు పలుమార్లు సందర్శించారు. పనుల పురోగతి గురించి తెలుసుకున్నారు. కాని, ఆ తర్వాత పురోగతిపై ఎలాంటి సమాచారం లేకుండా పోయింది. వీలైనంత త్వరలోనే అందుబాటులోకి తీసుకురావడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నట్లు రైల్వే అధికారులు చెబుతున్నారు.

అందుబాటులో లేని కనెక్టివిటీ రోడ్లు..

చర్లపల్లి రైల్వే టెర్మినల్ (స్టేషన్) నుంచి నగరంలోకి ప్రయాణికులు రాకపోకలు కొనసాగించడానికి అవసరమైన రోడ్ల కనెక్టివిటీ లేదని రైల్వే అధికారులు తెలిపారు. టెర్మినల్ నిర్మాణ బాధ్యతలు రైల్వే అధికారులు తీసుకున్నప్పటికీ, అందుకు సంబంధించిన రోడ్ల కనెక్టివిటీ బాధ్యతలు మాత్రం రాష్ట్ర ప్రభుత్వం చూసుకోవాల్సి ఉందని, ఈ విషయంపై రైల్వే అధికారులు పలుమార్లు జీహెచ్ఎంసీ అధికారులతో కూడా సంప్రదింపులు జరిపినట్లు తెలిపారు. రోడ్లు అందుబాటులో లేక పోయినట్లయితే ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులుంటాయని, ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెబుతున్నారు. అలాగే, టెర్మినల్ నుంచి ఆర్టీసీ వంటి పబ్లిక్ ట్రాన్స్‌పోర్టుతో ఆటోలు, కార్ల వంటి ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు అందుబాటులోకి తేవాల్సి ఉంది.

ముంపు సమస్యలను జాతీయ విపత్తుగా ప్రకటించాలి

రూ.10 వేల కోట్లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలి
సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాల మల్లేశ్



జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

మేడ్చల్ కలెక్టరేట్, సెప్టెంబర్ 12: వరద ముంపు బాధితుల సమస్యలను జాతీయ విపత్తుగా ప్రకటించి, ఇందుకు రూ.10 వేల కోట్లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాల మల్లేశ్ అన్నారు. మేడ్చల్ కలెక్టరేట్ కార్యాలయం వద్ద సీపీఐ ధర్నా ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో భారీ వర్షాలు పడటంతో పంట, పశు, ప్రాణ నష్టం జరిగిందని, పేద, మధ్యతరగతి ప్రజల ఇండ్లు కూలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరదల వల్ల ఇండ్లు కూలిపోయిన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు దామోదర్ రెడ్డి, ఉమా మహేష్, దశరథ, శంకర్, హరినాథ్, ధర్మేంద్ర, యాదయ్య గౌడ్, నరేందర్ ప్రసాద్, సహదేవ్, రాములు గౌడ్, నరసింహ, సల్మాన్ బేగ్, మహాలక్ష్మి, నాగజ్యోతి, కృష్ణ పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం

భువనగిరి అర్బన్/ చౌటుప్పల్ టౌన్, సెప్టెంబర్ 12 : భువనగిరి, చౌటుప్పల్ పట్టణాల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను బీజేపీ ఆధ్వర్యంలో గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా భువనగిరిలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ విదేశాల్లో దేశ అత్యున్నత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, ఎన్నికల విధానాన్ని అవహేళన చేస్తూ మాట్లాడడం సిగ్గుమాలిన చర్య అన్నారు. కార్యక్రమాల్లో బీజేపీ భువనగిరి పట్టణ అధ్యక్షుడు రత్నపురం బలరాం, మున్సిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ, నాయకులు మల్లేశం, జగన్మోహన్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, భిక్షంగౌడ్, జంగయ్యగౌడ్, సురేందర్ రెడ్డి, మల్లేశ్ పాల్గొన్నారు.

పోయిన సెల్‌ఫోన్ల రికవరీ

మోత్కూరు : పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని దాచారం గ్రామానికి చెందిన సూరారం నర్సయ్య, మున్సిపాలిటీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సుధీర్‌రెడ్డి తమ సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారు. వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కనిపెట్టి బాధితులకు గురువారం అప్పగించినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

భారత్, ఇరాన్‌ల మధ్య వారధిగా నగరం

ఇరు దేశాల మధ్య పర్యాటక బంధం బలపడాలి
పర్యాటక రోడ్డు షోలో ఇరాన్ డిప్యూటీ టూరిజం మంత్రి షల్బా ఫియాన్



సిటీబ్యూరో, సెప్టెంబర్ 12(నమస్తే తెలంగాణ): భారత్, ఇరాన్‌ల మధ్య పర్యాటక సంబంధాలు మరింత బలపడాలని ఇరాన్ పర్యాటక శాఖ డిప్యూటీ మంత్రి షల్బాఫియాన్ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో గురువారం ఇరాన్ పర్యాటక రోడ్ షో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శతాబ్దాలుగా ఇరాన్, భారత్ దేశాల మధ్య చారిత్రక, సాంస్కృతిక అనుబంధం ఉందని చెప్పారు. ఇరాన్ పట్ల సానుకూల వాతావరణం ప్రోత్సహించడం, అంతర్జాతీయ పర్యాటకులను రప్పించడం, కొత్త వ్యాపార అవకాశాలను సృష్టించడం, సాంస్కృతిక అనుబంధాన్ని మరింత విస్తరించడమే లక్ష్యంగా దేశంలో పర్యాటక రోడ్ షోలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. హైదరాబాద్‌తో ఇరాన్‌కు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. రెండు దేశాలను కలిపే వారధిగా హైదరాబాద్ నిలుస్తుందని పేర్కొన్నారు. అనంతరం, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి మాట్లాడుతూ, ఇరాన్ సాంస్కృతిక సంపద గురించి మరింత లోతుగా తెలుసుకోవడానికి ఇరు దేశాల మధ్య పర్యాటక సంబంధాలు బలోపేతం చేయడానికి రోడ్డు షోలు గొప్ప వేదికగా నిలుస్తాయని చెప్పారు. ప్రపంచ పర్యాటక పటంలో తెలంగాణ ఒక ప్రముఖ గమ్యస్థానంగా నిలిచిందని వివరించారు. పర్యాటకులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు వారసత్వ పరిరక్షణ, స్థానిక కళలు, హస్తకళలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్, ఇరాన్ కాన్సులేట్ సెకండ్ కన్సుల్ మోహసిన్ మొగద్దమి, షోజేహి, తెలంగాణ పర్యాటక శాఖ డైరెక్టర్ ఇలా త్రిపాఠి, హైదరాబాద్ పర్యాటక శాఖాధికారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రియల్టర్ నిర్వాకంతో సాగునీటి కాల్వకు గండి

తూము నీళ్లు రాకుండా పైపులు అడ్డంగా వేయడంతో గండి పడిన అక్కాచెల్లెల చెరువు

వలిగొండ, సెప్టెంబర్ 12 : మండల కేంద్రానికి చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి సాగునీరందించే కాల్వకు అడ్డంగా పైపులు వేయడంతో గండి పడి పంట పొలాలకు నీరందని దుస్థితి ఏర్పడింది. గురువారం వలిగొండలోని అక్కాచెల్లెల చెరువు ఆయకట్టు రైతులు మాట్లాడుతూ చెరువుకు తూర్పున ఉన్న తూము ద్వారా సుమారు 200 ఎకరాలకు సాగునీరందించే కాల్వకు అడ్డంగా రియల్ ఎస్టేట్ వ్యాపారి అక్రమంగా పైపులు వేసి పూడ్చివేశారన్నారు. దీంతో పైపులు వేసి పూడ్చిన పైభాగంలో కాల్వకు గండి పడి పంట పొలాలకు సాగునీరందక పొలాలు ఎండిపోతున్నాయని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి పైపులను తొలగించి పంటలను కాపాడాలని రైతులు పబ్బు లక్ష్మయ్య, ఎండీ రషీద్, మోటె రాములు, మైసోళ్ల శంకరయ్య కోరారు.

అవినీతి నిర్మూలను కలిసి పనిచేయాలి

- సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ ముస్తఫా



దాతారుపల్లిలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న సెంట్రల్ బ్యాంకు అధికారులు

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 12 : అవినీతిని నిర్మూలించేందుకు ప్రభుత్వం, పౌరులు, ప్రైవేట్ రంగం వాటాదారులు కలిసి పనిచేయాలని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్, విజిలెన్స్ అధికారి షేక్ ముస్తఫా అన్నారు. మండలంలోని దాతారుపల్లిలో మహిళా సహకార సంక్షేమ సంఘాలు, పౌరులకు సమగ్ర నిజాయితీపై సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులకు లంచం ఇవ్వకుండా నిజాయితీగా పని చేయించుకోవాలన్నారు. అవినీతి జరిగితే సంబంధిత శాఖకు తెలియజేయాలని సూచించారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యాదగిరిగుట్ట బ్రాంచ్ మేనేజర్ జీఎస్ దుర్వే, మేనేజర్ శ్రీరామకృష్ణారెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ జి.రాజేందర్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకు కార్యాలయం మార్పు

యాదగిరిగుట్ట పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద ఉన్న సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయాన్ని గుండ్లపల్లిలోని హనుమాన్ టెంపుల్ రోడ్డుకు మార్చుతున్నట్లు బ్రాంచ్ మేనేజర్ రామకృష్ణారెడ్డి ప్రకటించారు.

జాతీయ జెండా ఆవిష్కరణలో స్థానిక ప్రజాప్రతినిధికి అవకాశం కల్పించాలి : సీపీఐ

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 12 : ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ఈ నెల 17న జిల్లా కేంద్రంలో జాతీయ జెండాను ఆవిష్కరించే అవకాశం స్థానిక ప్రజాప్రతినిధి అయిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు బదులు గుత్తా సుఖేందర్‌రెడ్డిని ఎంపిక చేయడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి మండలి, ఇతర జిల్లాల్లో అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, నాయకులు శ్రీధర్, మహేందర్, పెంటయ్య, రాజు, పుష్ప పాల్గొన్నారు.

మహేశ్‌కు ప్రశంసా పత్రం

ఆలేరు టౌన్, సెప్టెంబర్ 12 : రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ సంవత్సరం నాలుగు రక్తదాన శిబిరాలు నిర్వహించి అత్యధిక యూనిట్స్ డొనేషన్ చేసినందుకుగానూ సంస్థ అధ్యక్షుడు పులిపలుపుల మహేశ్ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. జనగాం జిల్లా వైద్యాధికారి డాక్టర్ దివ్య గురువారం అక్కడి కార్యాలయంలో ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ రక్తాన్ని దానం చేసి ప్రశంసా పత్రాన్ని అందుకోవడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే కాలంలో అనేక రక్తదాన శిబిరాలు నిర్వహించి మరిన్ని యూనిట్స్ డొనేట్ చేస్తామని తెలిపారు.